మూల నక్షత్ర వేడుకలకు భారీ బందోబస్తు: ఎస్పీ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసరలో బుధవారం నిర్వహించే మూల నక్షత్ర వేడుకలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మంగళవారం బాసరలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకొని పూజలుచేశారు. ఆలయ ఈఓ విజయరామారావుతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. బాసరలో బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా బందోబస్తు చేపట్టాలని సూచించారు. భక్తుల ఇబ్బందులను తొలగించడానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. జేబు దొంగతనాలు, ఆభరణాల చోరీకి అవకాశం ఉందని చెప్పారు. కంట్రోల్ రూంలో నిరంతరం సీసీ కెమెరాలను పరిశీలించాలని ఆదేశించారు. గోదావరి నది వద్ద సైతం పోలీసులు భక్తులకు సూచనలు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకిషర్మిల



కాత్యాయనిగా సరస్వతి


ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కాత్యాయని రూపంలో సరస్వతి అమ్మవారు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది.


ట'మాట' అనలేం.. వెల్లుల్లి కొనలేం

● పండగ వేళ కొండెక్కిన 'కూరగాయలు'

మంచిర్యాల అర్బన్, వాంకిడి న్యూస్‌టుడే

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కుదేలైన పంట పొలాలు, కూరగాయల తోటలతో పట్టణాలకు పెద్ద కష్టమే వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతంతోపాటు సిద్దిపేట నుంచి వచ్చే కూరగాయలపై ఉమ్మడి జిల్లావాసులు ఆధారపడ్డారు. వేసవి కాలం మాదిరి వర్షాకాలంలోనూ విపణిలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు లేకపోవడం, శ్రావణం, గణపతి, దేవి నవరాత్రి ఉత్సవాలు వరుసగా రావడం ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.





కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి...



మార్కెట్‌లో మిర్చిబండ్లు, గప్చుప్‌ల వద్ద తప్పనిసరిగా ఉల్లి వాడుతారు. కొద్దిరోజులుగా ఉల్లి ధర దడ పుట్టిస్తుండడంతో వాటిని వాడటమే మానేశారు. ఎందుకంటే మార్కెట్‌లో దాని ధర కిలో రూ. 55. వేసవిలో రూ. 20 ఉన్న ఉల్లి రెట్టింపు కావడంతో వంటల్లో వాటిని వాడడం తక్కువ చేశారు. ఉమ్మడి జిల్లాకు కర్నూలు, సోలాపూర్ నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. నెల క్రితం వరకు కిలో రూ. 40 ఉన్న అలుగడ్డ ప్రస్తుతం రూ. 50 పలుకుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి అయ్యే ఆలుగడ్డ ధరలు ఇప్పట్లో తగ్గడం కష్టమే అంటున్నారు వ్యాపారులు.

ఇతర వాటి పరిస్థితి అంతే..

సంత రోజు కూరగాయలు కొనేందుకు వెళ్తే రూ.500 ఖర్చు అవుతున్నాయి. వారానికి ఇంత ఖర్చయితే ఎలా అని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ఆకుకూరల ధర కూడా పెరిగిపోయింది. కొత్తిమీర నాందేడ్ నుంచి దిగుమతి కావడంతో రూ.20 ఇస్తే కానీ చిన్న కట్ట ఇవ్వడం లేదు.

వెల్లుల్లిదీ అదే దారి..



కరోనా సమయంలో కిలో రూ. 60 ఉన్న వెల్లుల్లి ధర కొద్దిరోజులుగా కిలో రూ. 320కి చేరింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఉమ్మడి జిల్లాకు వెల్లుల్లి వస్తుంది. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి ధరలు హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. కొత్త పంట వచ్చే వరకు ఈ తిప్పలు తప్పవంటున్నారు.

వర్షాలతో తగ్గిన దిగుమతి

కొద్దిరోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగుకు ఇబ్బంది నెలకొంది. మంచిర్యాల మార్కెట్‌కు సిద్దిపేట, ఒంటిమామిడి, గంగాపూర్, కళ్యాణదుర్గం నుంచి కూరగాయలు వస్తుంటాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని మండలాల్లో టమాట, వంకాయ సాగు చేస్తున్నప్పటికీ తీగజాతి కూరగాయలకు ఇతర ప్రాంతాల మీద ఆధారపడాల్సిందే. నిర్మల్ జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలు ఎక్కువగా ఉంటాయి. కూరగాయల సాగు చాలా తక్కువ. ఈ జిల్లావాసులు మహారాష్ట్ర, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాల పంటలపై ఆధారపడుతున్నారు. కుమురంభీం జిల్లాలో రెబ్బెన మండలం గంగాపూర్‌లో కొంత కూరగాయలు సాగు చేస్తున్నప్పటికీ స్థానికంగా విక్రయించడంతోపాటు మంచిర్యాలకు దిగుమతి చేస్తున్నారు.

సామాన్యులకు శరాఘాతం

- గడ్డం మధుకిరణ్, ప్రైవేటు ఉద్యోగి, మంచిర్యాల



గత కొద్దిరోజులుగా కూరగాయల ధరల పెరుగుదల ఆందోళన కల్గిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి కూరగాయ, ఆకుకూర కొనాల్సిందే. టమాట ధర పెరిగిన కొనక తప్పడం లేదు. వీటికి తోడు ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరిగాయి. మార్కెట్‌కు రూ. 500తో వెళ్లినా వారం రోజుల పాటు సరిపడా కూరగాయలు రావడం లేదు. కూరగాయలకు బదులు పప్పులు వండాల్సి వస్తుంది.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం



నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్‌లోని నటరాజ్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పి.రవి తెలిపారు. ఇంద్రానగర్, గొల్లపేట్, శాస్త్రినగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ మున్సిపల్ ఒప్పంద కార్మికులు, సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని నాయకులు కోరారు. పురపాలిక కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. కార్మికులు ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. భారాస నాయకులు మద్దతు తెలిపి కలెక్టరేట్‌లో ఏవో సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. పార్టీలు, సంఘాల నాయకులు మహమ్మద్ నజీరుద్దీన్, మహమ్మద్ నయీమొద్దీన్, మహమ్మద్ బిన్ అలీ, మసూద్‌ఖాన్, మహబూబ్, దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, మురళీమోహన్, సాయికిరణ్, మల్లేశ్, పోశెట్టి, రాజమణి, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సోఫీనగర్‌లో బై నెంబర్లతో బిట్లుగా మారిన ప్రభుత్వ స్థలం

ప్రభుత్వ ప్రైవేటు భూమా?

ఈటీవీ - ఆదిలాబాద్ : ఒక పడక గదితో ఇల్లు నిర్మించుకోవాలంటే కనీసం 100 గజాల స్థలం అవసరం. సొంత స్థలమైతే ఏ ఇబ్బంది లేదు. ప్రభుత్వ భూమైతే తహసీల్దారో, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వచ్చి కూల్చివేస్తారనే భయం వెంటాడుతుంది. అదే ప్రభుత్వం కేటాయించినట్లు ఏదైనా ఆధారం ఉంటే ఏం కాదనే ధీమా ఉంటుంది. దేనికైనా దస్త్రాలే కీలకం. కానీ నిర్మల్ పట్టణ పరిధిలో రూ.వందల కోట్ల విలువ చేసే సోఫీనగర్ భూముల్లో చేపట్టిన ఓ నిర్మాణం ఇప్పుడు సమస్యగా మారింది. ఆ స్థలం ప్రభుత్వానిదా? ప్రైవేటుదా? అనేది తేల్చటం అధికారులకు పరీక్షగా మారింది.

● నిర్మాణం వివాదాస్పదం.. మాయమైన దస్త్రాలు

ఇదీ కథ..

నిర్మల్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న ప్రస్తుత సోఫీనగర్ ప్రాంతమంతా 60వ దశకంలో ప్రభుత్వ భూమిగా ఉండేది. అప్పుడు 175 సర్వే నెంబరులో 46.13 ఎకరాలతో విస్తరించి ఉండేది. ఆ తర్వాత 1965-66లో 262, 256 సర్వే నెంబర్లుగా మారింది. ఆ ప్రాంతంలో అప్పట్లోనే ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో సోఫీనగర్ ఏర్పడింది. మరికొంత పారిశ్రామిక ప్రాంతంగా ఉండేది. ఏడాదిన్నర కిందట వరకు ఈ పరిసరాలన్నీ పారిశ్రామిక ప్రాంతాలుగానే ఉండేవి. అలా బైనంబర్లతో బిట్లు బిట్లుగా మారింది. శాసనసభ ఎన్నికల ముందు కొత్త మాస్టర్ ప్రణాళిక తెర మీదకు వచ్చింది. అప్పట్లో ఇళ్లతో విస్తరించిన స్థలాలను కమర్షియల్ ప్రాంతంగా, మిగిలినదంతా పారిశ్రామిక ప్రాంతంగా మార్చడం రాజకీయంగా ఆందోళనలకు దారితీసింది. ఎన్నికలతో అది మరుగునపడింది.

ఇప్పుడేం జరిగింది?

తాజాగా ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం సర్వే నిర్వహించింది. గతంలో 175 సర్వే నెంబరు పరిధిలో 46.13 ఎకరాలుంటే తర్వాత మారిన 262 సర్వే నెంబర్ పరిధిలో 38.16 ఎకరాలు, 256 సర్వే నెంబర్ పరిధిలో మరో 4.29 ఎకరాలతో ఉన్నట్లు తేలింది. మరో 3.08 ఎకరాల భూమి లెక్కతేలడం లేదు. ఆ భూమి అంశం అధికారులకు తలనొప్పిగా మారింది. ఎన్నికల కంటే ముందే హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ అదే ప్రాంతంలో 4.29 ఎకరాల విస్తీర్ణంలో భారీ నిర్మాణం చేపట్టింది. రూ.కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. ఇప్పుడున్న మార్కెట్ ధరల ప్రకారం అక్కడ ఒక్కో ఎకరం ధర కనీసం రూ.10 కోట్లకు పైగా పలుకుతోంది. ప్రభుత్వం కేటాయించినట్లయితే దానికి సంబంధించిన దస్త్రాల్లో, అసైన్డ్ పత్రాల్లో అందుబాటులో ఉండాలి. అలాంటివేం అందుబాటులో లేకపోవటం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై జిల్లాలోని ఓ కీలక అధికారి మరో డివిజనల్ అధికారి సహా కింది స్థాయి రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సర్వే చేయించగా.. ప్రభుత్వ దస్త్రాలు అందుబాటులో లేకపోవటం కలకలం సృష్టిస్తోంది. దస్త్రాలను మాయం చేసిందెవరు? లబ్ధి పొందినది ఎవరు? అనేది రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

విచారణ చేస్తున్నాం

రత్నమాల, ఆర్డీవో, నిర్మల్

సోఫీనగర్ ప్రాంతంలో విచారణ చేస్తున్నాం. ప్రభుత్వ భూమైనా. ప్రైవేటుదైనా పత్రాలు ఉండాలి. సమగ్ర విచారణ చేస్తున్నాం. ఆ భూమి ఎవరి ద్వారా, ఎలా వచ్చిందో చూడాల్సి ఉంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్, మున్సిపల్ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూస్తాం.

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో సాగుచేసిన ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. కోతలు మొదలైన వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. సన్నధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్ ఇస్తుందనే విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సన్నరకాల ధాన్యం బస్తాలపై కొనుగోలు కేంద్రం వివరాలు ముద్రించాలని సూచించారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం బస్తాలను వేర్వేరు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. తూకం యంత్రాలకు స్టాంపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొనుగోళ్ల వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో రోజువారీగా నమోదు చేయాలన్నారు. కేంద్రాల్లో మద్దతు ధర, నిర్వాహకుల సమాచారం, తదితర అంశాలతో పూర్తి వివరాలు రైతులకు తెలిసేలా ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. టార్పాలిన్లు, గోనె సంచులు, తూకం, తేమ, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు, సిబ్బందిని నియమించాలని కోరారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏఓ అంజిప్రసాద్, ఎల్‌డీఎం రాంగోపాల్, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: జిల్లా ముఖ్య ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్థిక సామాజిక ముఖచిత్రం-2024 పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటుహక్కు నమోదు, ఎన్నికల నిర్వహణపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గతంలో ఓటుహక్కు నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలు భాజపా పనితీరుకు నిదర్శనం

నిర్మల్ పట్టణం: హరియాణా, జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర ఎన్నికల్లో భాజపా సాధించిన విజయంపై ఆ పార్టీ జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు తినిపించుకున్నారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య ఫలితాలు భాజపా పనితీరుకు రెఫరెండం లాంటివన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి, మెడిసెమ్మె రాజు, పట్టణాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదం అరవింద్, అల్లం భాస్కర్, నాయకులు అయ్యన్నగారి రాజేందర్, కమల్‌నయన్, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణం: పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కన్నా దేశ భవిష్యత్తు కోసమే పనిచేసే ఏకైక పార్టీ భాజపా అని బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల్లో చాలావరకు కుటుంబపార్టీలే ఉన్నాయని, వారంతా తమ కుటుంబసంక్షేమానికే పనిచేస్తున్నారని గుర్తించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధిస్తోందని, రక్షణలోనూ శత్రుదుర్భేద్యంగా మారుతోందని చెప్పారు. కుటుంబసభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే అది కుటుంబ బలమని, అలాగే భాజపా సభ్యత్వ నమోదు ఎక్కువగా ఉంటే అది దేశానికి బలమని చెప్పారు. సమావేశంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, నాయకులు ఆకుల కార్తీక్, కొండాజి నరేంద్రచారి, తోట సత్యనారాయణ, రాకేశ్, పొన్నం నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి

కడెం, న్యూస్‌టుడే : జీవకోటి మనుగడకు అడవులు, వన్యప్రాణులు దోహదపడుతాయని కడెం, ఉడుంపూర్ అటవీ క్షేత్రాధికారులు గీతారాణి, అనితలు పేర్కొన్నారు. 70వ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆయా రేంజిల పరిధిలో అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల మనుగడ మెరుగుపడితే జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతామన్నారు. పాండ్వాపూర్, కన్నాపూర్, ఉడుంపూర్, దోస్తునగర్‌లలో ఎఫ్ఆర్వోలు అడవుల రక్షణ ఆవశ్యకతను వివరించారు. డీఆర్వోలు సిద్ధార్థ, డి.ప్రకాష్, చంద్రమౌళి పాల్గొన్నారు.



కడెం: దోస్తునగర్ సమీపంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



విద్యార్థిని అభినందిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

విజయస్ఫూర్తి కొనసాగించండి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: సామాన్య కుటుంబంలో జన్మించినా జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ఫలితాలు దక్కించుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన గాయత్రి- సుగుణాకర్ దంపతుల కుమారుడు సదానంద్ అఖిల భారత వైద్యవిద్య ప్రవేశపరీక్షలో 8వ ర్యాంకు దక్కించుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు మంగళవారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, మంచి వైద్యుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ మేడారం అపర్ణ, నాయకులు ధర్మాజిగారి రాజేందర్, ఆమెడ శ్రీధర్, మేడారం ప్రదీప్, అనిల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త గురువులొచ్చేస్తున్నారు


● నేడు హైదరాబాద్‌లో నియామకపత్రాల అందజేత ● దసరా తర్వాత బడులకు..



నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకునే కార్యక్రమం విజయవంతం చేసేందుకు వివిధ శాఖల సమన్వయంతో విద్యాశాఖ అధికారులు మంగళవారం ఏర్పాట్లు చేశారు. 278 మంది స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ, భాషాపండితులు ఎంపికైన విషయం తెలిసిందే. కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈవో సభ్యుడిగా, డీఈవో కన్వీనర్ సభ్యుడిగా కమిటీ వేశారు. ఎస్పీ, డీఎంహెచ్‌వో, ఆర్టీసీ డీఎం సమన్వయంతో సీఎం సభ విజయవంతానికి కలెక్టర్ సూచనలు చేశారు. అభ్యర్థుల కోసం ఏడు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఇందులో రెండు భైంసాలోని మండల విద్యావనరుల కేంద్రం, అయిదు నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరి వెళ్లనున్నాయి. ఒక్కో బస్సుకు ఒక ఎంఈవో, ఎస్కార్ట్‌గా పోలీసు సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, వైద్య సదుపాయం కోసం ఏఎన్‌ఎంతో పాటు లొకేషన్ ఎప్పటికప్పుడు పంపించేందుకు ప్రత్యేకంగా ఒకరిని నియమించారు. జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలను కేటాయించారు. బాలింతలు, చంటిపిల్లలు కలిగిన అభ్యర్థులు, దివ్యాంగులు, గర్భిణులు ఉంటే వారికి సహాయకులుగా ఒకరిని వెంట తెచ్చుకునేందుకు వీలు కల్పించారు. వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లు చేశారు. నియామక పత్రాలు అందించిన వెంటనే పోస్టుల భర్తీ కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. దీనిపై మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దసరా సెలవులు ఈ నెల 14న ముగియనున్నాయి. 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో దసరా తర్వాత బడులకు కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. జిల్లా వ్యాప్తంగా 278 మంది గురువులు కొత్తగా రానుండడంతో విద్యార్థుల సమస్యలు తీరనున్నాయి. డీఎస్సీ అభ్యర్థుల నియామక పత్రాల సభ విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేశామని, వారితో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశామని డీఈఓ రవీందర్‌రెడ్డి చెప్పారు.



డీఎస్సీ అభ్యర్థులను హైదరాబాద్ తరలించే ఏర్పాట్లలో విద్యాశాఖ అధికారులు, సూచనలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి






విద్యుద్దీపాలంకరణలో ఆలయం


గదులు లేకపోవడంతో ఆరుబయట నిద్రిస్తున్న భక్తులు

మూల నక్షత్ర వేడుకలకు బాసర సిద్ధం

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం బుధవారం మూల నక్షత్ర వేడుకలకు ముస్తాబైంది. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూల కావడంతో ఈ వేడుకలకు ప్రత్యేకత ఉంది. వేకువజామున రెండు గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారికి చతుష్షష్టి పూజలు, హారతి, నివేదన కార్యక్రమాలు సాగుతాయి. ఈ శుభఘడియల్లో ఆలయంలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు రైళ్లు, బస్సులు, సొంతవాహనాల ద్వారా బాసరకు చేరుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బాసరకు భక్తుల రాక మొదలైంది. నవరాత్రి ఉత్సవాల్లో ఒకరోజు సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రం వస్తుంది. ఆ రోజు అమ్మవారి చెంత అక్షరాభ్యాసాలు నిర్వహిస్తే ప్రయోజకులవుతారనే విశ్వాసంతో భక్తులు భారీగా తరలివస్తారు. అక్షరాభ్యాసాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.


క్యూలైన్లలో భక్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన బెంచీలు

ఏర్పాట్లు పూర్తి

సరస్వతి అమ్మవారి మూల నక్షత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్షరాభ్యాసాలు, దర్శనాలు, పూజల సమయంలో భక్తులకు సమస్యలు తలెత్తకుండా దేవాదాయశాఖ జాగ్రత్తలు తీసుకుంది. రద్దీకి అనుగుణంగా అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అదనపు టికెట్ కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఈసారి వీఐపీ పాసులను రద్దు చేశారు. ప్రముఖులకు దర్శనాలు చేయించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేసిన వారికి ప్రత్యేకంగా వరుస ఏర్పాటు చేసి వారికి దర్శనం కల్పించనున్నారు. ఉచిత దర్శనం, రూ.150 అక్షరాభ్యాసాలకు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి, ప్రత్యేక దర్శనం కోసం ఆలయాధికారి కార్యాలయం ఎదుటి నుంచి వరుసలను ఏర్పాటు చేశారు. వరుసలో ఉన్న భక్తులు కూర్చుండేలా బెంచీలను ఏర్పాటు చేశారు. భద్రత, పార్కింగ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తుల సేవలకు పలు సంఘాలు, భక్తబృందాలు సేవలను ఆలయం వినియోగించనుంది. పుణ్యస్నానాల వేళ భక్తుల భద్రత దృష్ట్యా గోదావరి నది వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ నిజామాబాద్, భైంసా డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది.

నిండిన గదులు.. ఆరుబయటే భక్తులు


ఆలయానికి చెందిన వసతి గదులు మరమ్మతుల్లో ఉండటం, మిగిలిన వసతి గృహాలు ప్రముఖులకే కేటాయించడంతో బాసరకు వచ్చే భక్తుల వసతి కష్టాలు మొదలయ్యాయి. ప్రైవేట్ లాడ్జీల్లో గదుల ధరలు రెండింతలు చేశారు. దీంతో సామాన్య భక్తుల పరిస్థితి దారుణంగా తయారైంది. డబ్బు ఉన్న వారు ప్రైవేట్ గదులను అద్దెకు తీసుకున్నారు. డబ్బులు లేని వారు ఆరుబయటనే సేదతీరాల్సి వస్తోంది. కొందరు భక్తులు నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి పట్టణాల్లోనే బసచేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వీరంతా బుధవారం ఉదయం బాసరకు రానున్నారు.

ఆదిశక్తి ఆరాధన.. ఆడపిల్లకు నిరాదరణ

జిల్లాలోని ఓ మండలానికి చెందిన వ్యాపారికి తొలి సంతానంగా కుమార్తె పుట్టింది. రెండో కాన్పులో కూడా కూతురు పుడుతుందేమోనని భావించి మహారాష్ట్రలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. మగ బిడ్డ ఉన్నట్లు ముందే తెలుసుకున్నాడు. ఒక వేళ ఆడపిల్ల ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.

నేడు పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిని ఆరాధించే ప్రజలే ఆడపిల్ల అంటే చిదిమేస్తున్నారు. శివుడిలో సగం.. అవనిలో సగం అంటూనే తమ ఇంట మాత్రం వదిలించుకోవాలని చూస్తున్నారు. కాసుల కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు పుట్టబోయేది ఆడ, మగ అనేది ముందే చెప్పేస్తూ.. భ్రూణహత్యలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో నిరాక్షరాస్యత, పేదరికం కూడా వాటికి తోడవుతోంది.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



ఇలా చేస్తే ప్రయోజనం..

- లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి
- వరకట్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వరకట్నం తీసుకున్నట్లు తెలిసినా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి.
- ఆడపిల్లల చదువు కోసం గతంలో మాదిరిగా బంగారుతల్లి వంటి పథకాలను అమలు చేయాలి
- ఆడ శిశువులకు జన్మనిచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి
- స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం మరింత పెంచాలి

లింగనిష్పత్తి (● బాలురు ● బాలికలు)

జిల్లా	బాలురు	బాలికలు
ఆదిలాబాద్	1000	989
నిర్మల్	1000	1046
కుమురం భీం	1000	998
మంచిర్యాల	1000	977

● ఆందోళన కలిగిస్తున్న బాలబాలికల నిష్పత్తి

● జిల్లా ● 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు ● బాలురు ● బాలికలు

జిల్లా	0 నుంచి 6 ఏళ్ల పిల్లలు	బాలురు	బాలికలు
కుమురంభీం	66206	34053	32153
నిర్మల్	82769	42,462	40,307
మంచిర్యాల	73725	38578	35147
మంచిర్యాల	89,283	46,225	43058




ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి కారణాలు ఏమిటి? జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్ష నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నారా? ఆడపిల్లల సంఖ్య పెరగడానికి ప్రభుత్వం ఏం చేయాలన్న అంశాలపై జిల్లాలో 100 మందిపై 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.


మహారాష్ట్రలో లింగ నిర్ధారణ పరీక్షలు..

జిల్లాలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై అధికారుల నిఘా కరవైంది. గతంతో పోల్చితే నిర్ధారణ పరీక్షలు తగ్గినా.. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. కొంత మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఆడ, మగ అన్నది కోడ్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లావాసులు సరిహద్దులోని మహారాష్ట్రకు లింగ నిర్ధారణ పరీక్షల కోసం వెళ్తున్నారు. అక్కడి ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు డబ్బుల ఆశతో ఆడ, మగ అన్నది తెలియజేస్తున్నాయి. ఫలితంగా చాలా మంది అక్కడే గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేసుకుంటున్నారు.

1 నేటి సమాజంలో చదువు, ఇతర విషయాల్లో ఆడ, మగ పిల్లలకు సమ ప్రాధాన్యం ఉందా?




2 లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, వరకట్న నిషేధం వంటి వాటి నియంత్రణ, మహిళల భద్రతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయా?











● జనాభా ● పురుషులు ● మహిళలు

జిల్లా	జనాభా	పురుషులు	మహిళలు
కుమురంభీం	5,15,812	258197	257615
నిర్మల్	709418	346721	362697
మంచిర్యాల	807037	408272	398765
ఆదిలాబాద్	7,08972	3,56,407	3,52,565


తర్లపాడ్‌లో రూ.6.10లక్షల నగదుతో అలంకరించిన అమ్మవారు


లోకేశ్వరం: ధర్మోరలో రూ.5 లక్షల కరెన్సీతో దుర్గాదేవి


దిలావర్‌పూర్‌లో రూ.13,80,800 కరెన్సీ నోట్లతో అలంకరించిన భక్తులు

నేత్రపర్వం.. ధనలక్ష్మి రూపం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి మండపాలను ఉత్సవ నిర్వాహకులు కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, ఖానాపూర్ గ్రామీణం, లోకేశ్వరం, దిలావర్‌పూర్

పసిపాప పాల కోసం ఆవు విరాళం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం టెంబ్రీగూడకు చెందిన పసిపాప దయనీయ పరిస్థితిని 'ఈనాడు'లో చూసి బోథ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి. హుస్సేన్ చలించారు. మంగళవారం ఇచ్చోడ జై శ్రీరామ్ గోశాల నుంచి ఆవు, దూడను పసిపాప తండ్రికి అందజేశారు. దేశ్‌ముఖ్ మారుబాయి ఆడపిల్లకు జన్మనిచ్చిన 23 రోజులకే చనిపోయింది. తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం పడుతున్న పాట్లపై 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసి న్యాయమూర్తి స్పందించారు. ఆవును, దూడను వారికి ఇచ్చారు. గోశాల నిర్వాహకుడు రాజేశ్ ఉన్నారు. మరోవైపు మానవతావాదులు తమ వంతుగా ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు విరాళాలు రూ. 32,400 జమయ్యాయి.


పసిపాప తండ్రికి ఆవు, దూడను అందజేస్తున్న న్యాయమూర్తి హుస్సేన్



తాపీమేస్త్రీలు.. సహాయకులకు

దండేపల్లిలో గోడల నిర్మాణంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న చిత్రం ఇది. పునాది వేయడం దగ్గర నుంచి భవన నిర్మాణం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పగుళ్లు రాకుండా ఉండాలంటే సామగ్రి ఎంపికతో పాటు వీటిని ఏ నిష్పత్తిలో కలపాలి, సరైన కొలతల ప్రకారం ఎలా నిర్మించాలో తెలియజేస్తున్నారు. నాణ్యత, అందంగా ఉండటానికి చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.



కూలీల కుటుంబ సభ్యులకు..

ఆదిలాబాద్‌లో మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణ చిత్రమిది. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. వీరికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందజేయనున్నారు. కూలీల కుటుంబ మహిళా సభ్యులతోపాటు గుర్తింపు కార్డు ఉన్న మహిళలకు సైతం శిక్షణ ఇస్తారు. కుట్టుతోపాటు ఎంబ్రాయిడరీ, కంప్యూటర్‌తో మెరుగులు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.



నైపుణ్య శిక్షణ.. ఉపాధికి బాసట

● దండేపల్లిలో పురుషులతోపాటు మహిళలకు శిక్షకుడు వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కూలీలు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబరు, వెల్డింగ్, పెయింటింగ్ తదితర వృత్తుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. 15 రోజులపాటు శిక్షణ ఇవ్వడంతోపాటు రోజుకు రూ. 300లతో పాటు దుస్తులు, హెల్మెట్ అందజేస్తారు.

దండేపల్లి, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు మహిళలు సైతం వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. తమలోని సృజనాత్మకతతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. భవన నిర్మాణ మేస్త్రీల దగ్గర నుంచి కుట్టు మిషన్, ప్లంబర్, గోడలకు పెయింటింగ్ ఇలా పలు రంగాల్లో రాణిస్తూ మార్పులకు అనుగుణంగా తమ వృత్తులను మెరుగుపర్చుకుంటున్నారు. వీరిలో ఉన్న వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు జాతీయ నిర్మాణ అకాడమీ(న్యాక్) యువతకు శిక్షణ ఇస్తోంది. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న నిరుద్యోగ పురుషులతో పాటు మహిళలకు సైతం తరగతులు నిర్వహిస్తూ వృత్తులపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గోడలకు రంగులు వేయడంపై శిక్షణ పొందుతున్న మహిళలు

ఉపయోగకరంగా ఉంది: చింతల లహరి, కిష్టాపూర్, జన్నారం మండలం



వారం రోజులుగా దండేపల్లిలో నిర్వహిస్తున్న కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాను. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ మాతో పనులు చేయిస్తున్నారు. కుట్టుతోపాటు తాపీమేస్త్రీ, సిమెంటు పనులపై శిక్షణ తీసుకుంటున్నాం. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

రుణాలు పొందే అవకాశం

ఎం.నాగేంద్రం, న్యాక్ సహాయ సంచాలకుడు(ఏడీ), ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా



న్యాక్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీల నుంచి వివిధ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులపాటు తరగతులు నిర్వహిస్తూనే, క్షేత్రస్థాయిలో వివిధ అంశాల్లో మెలకువలు నేర్పుతున్నాం. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతో పాటు నిబంధనల మేరకు రుణాలు అందించే అవకాశం ఉంది.

బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి పట్టణం: నకిలీ నియామక పత్రాలు అందజేస్తున్న బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలో విద్యాంజలి 2.0 ప్రత్యేక పోర్టల్‌ను తీసుకొచ్చిందన్నారు. కొంతమంది ఈ పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ ఉచితంగా వాలంటీర్లను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తామని నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆ విద్యార్థులది గ్రామీణ నేపథ్యం. చదువంటే ఎంతో మక్కువ. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు వివిధ అంశాల్లోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారిలోని సృజనాత్మకతను గుర్తించి 28వ 'ప్రేరణ' జాతీయ సదస్సుకు ఎంపికయ్యే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చదువుకున్న గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలలో సెప్టెంబరు 21-28 తేదీల మధ్య నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. తెలంగాణ నుంచి కేవలం ఒక్క నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే చోటు లభించడం విశేషం.

-న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, గైడ్ టీచర్

గ్రామీణ నేపథ్యం.. అరుదైన అవకాశం

● 'ప్రేరణ' జాతీయ సదస్సు.. రాష్ట్రం నుంచి నిర్మల్ జిల్లా విద్యార్థులు

మామడ మండలం కొరటికల్‌కు చెందిన ఎం.రాజేందర్-లక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ ప్రస్తుతం స్వగ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి కులవృత్తి నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. చదువే ధ్యేయంగా నిత్యం పరితపిస్తూ ముందుకెళ్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి ముఖదంగూడ గ్రామానికి చెందిన ఎస్.హరీంద్రకుమార్-శ్వేత దంపతుల కూతురు ఎస్.హర్షిత నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రైవేటు అధ్యాపకుడు, తల్లి గృహిణి. అయిదో తరగతిలో పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యాలయంలో సీటు సంపాదించాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రేరణ మహోత్సవం'లో భాగంగా 'ఏక్ భారత్-వికసిత్ భారత్' పేరిట పాఠశాల, జిల్లా స్థాయిలో సహపాఠ్యాంశాలైన వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటికి కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఏప్రిల్-మే నెలలో నిర్వహించిన పోటీల్లో వీరిని ఎంపిక చేశారు.


గుజరాత్‌లోని మ్యూజియం విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న గైడ్

ప్రప్రథమంగా..

ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయ సదస్సుల్లో జిల్లా నుంచి ఎంపికైన వారు లేరు. 28వ ప్రేరణకు మాత్రం రాష్ట్రం నుంచి అదీ నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వడం చెప్పుకోదగ్గ విషయం. వీరికి గైడ్ టీచర్‌గా నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయం పీజీటీ (ఆంగ్ల బోధకురాలు) బి.కల్పన వ్యవహరించారు. వీరితోపాటు అసోం, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థిని, విద్యార్థులకు చోటు లభించింది. ప్రయోగాత్మక, బోధనోపకరణాలు, విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని నిపుణులైన నవోదయ విద్యాలయాలకు చెందిన సీనియర్ బోధకులు వివరించారు. సత్యం, అహింస, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, చరిత్రాత్మకమైన వాటి విశేషాలు సదస్సులో చెప్పారు. సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములయ్యేలా చైతన్యం తీసుకొచ్చేలా బోధించారు. శిక్షణతోపాటు అక్కడి విశేషాలు, చరిత్రాత్మక ప్రాంతాలను సందర్శించామని, ఇది ఎంతో గొప్ప అవకాశమని వారు వెల్లడించారు.

జిల్లాకు గర్వకారణం:

రవీందర్‌రెడ్డి, డీఈఓ, నిర్మల్

'ప్రేరణ' జాతీయ స్థాయి సదస్సుకు రాష్ట్రం నుంచే జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై అక్కడ శిక్షణ పొంది రావడం గర్వకారణం. ఈ కార్యక్రమం వారిలో ఆత్మస్థైర్యం, భవిష్యత్తులో లక్ష్య సాధనకు దిక్సూచిలా మారనుంది. పోటీ పరీక్షలకు మార్గదర్శకం. ఏకాగ్రత, చదువుపై మక్కువ పెరుగుతుంది. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించేలా ఏటా జిల్లా నుంచి ప్రాతినిధ్యం లభించేలా పిల్లలను తీర్చిదిద్దేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ పట్టణంలో కలకలంగా మారింది. తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన గౌడ రాజు(25)-గౌడ వైష్ణవి(22)లకు మూడేళ్ల కిందట వివాహమైంది. వైష్ణవి ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు మొదటి ఏడాది చదువుతోంది. ఇటీవల ఆమె జైనథ్ మండలం మాండగడలోని తల్లి గారింటికి వెళ్లింది. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేసి రావాలని చెప్పింది. దీంతో ఆయన ఆదిలాబాద్‌కు రాగా ఇద్దరు కలిసి స్థానిక గాంధీ ఉద్యానవనానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు పురుగు మందు తాగేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తమను కలిసి ఉండనివ్వడం లేదని, తరచూ వేధిస్తున్నారంటూ వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను విచారించగా దంపతులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన విషయమై ప్రాథమిక విచారణ జరుపుతున్నామన్నారు. ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. న్యాయమూర్తి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

చేతికందే ఎత్తులో తీగలు..

సమస్య: బీరవెల్లి సమీపంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. - రైతులు

సమాధానం: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. -రాజేందర్, ఏఈ బీరవెల్లి సెక్షన్.


వేలాడుతున్న తీగలను చేతితో పట్టుకుని చూపుతున్న రైతులు

-న్యూస్‌టుడే, సారంగాపూర్

సమస్య: నిర్మల్‌లోని గాజులపేట్ బుధవారపేట మసీదు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారం నెలకొంటోంది. - స్థానికులు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందితో ఏర్పాటు చేయించి స్థానికుల సమస్యలను పరిష్కరిస్తాం.
- సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్
– న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

ఖానాపూర్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పలువురు ఉపాధ్యాయులకు చోటు లభించింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పాతఎల్లాపూర్ జీహెచ్ఎం రమాదేవి, సుర్జాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దురిశెట్టి శ్రీనివాస్, ఖానాపూర్ గాంధీనగర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు కర్రం ప్రవీణ్, మస్కాపూర్ పాఠశాల హెచ్ఎం బి.నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాదనకుర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎ.శ్రీలత సోమవారం నిర్వహించిన రాష్ట్ర పీఆర్టీయూ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంబటి గంగన్న, మురళి తెలిపారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న కోల వేణు పీఆర్టీయూ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో తనను నియామకం చేసినట్లు తెలిపారు.

లోకేశ్వరం: హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు మండల బాధ్యులు రాజేందర్, రాజారాం, మురళీధర్‌లు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మల్లాగౌడ్, సురేశ్‌రావు, సదానందం, ఐధ వెన్నయ్య, శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌కుమార్, సంజీవ్‌లు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవేందర్, దేవేందర్‌రెడ్డి, నారాయణ, లాలు గంగాధర్‌లు ఎన్నికైనట్లు వారు వివరించారు.

సమస్యలుంటే అధికారులను సంప్రదించండి

కుభీర్, న్యూస్‌టుడే: విద్యుత్తు పంపిణీ, బిల్లుల చెల్లింపులో సమస్యలుంటే వినియోగదారులు అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ నారాయణ కోరారు. మంగళవారం కుభీర్‌లోని విద్యుత్తు ఉపకేంద్రంలో ఏర్పాటుచేసిన విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుభీర్, ముధోల్ మండలాల నుంచి ఒక్కో సమస్యను వినియోగదారులు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, ఈఈ ఆదిత్య, డీఈఈ శ్రీనివాస్, ఏఈ అజీముద్దీన్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

లోకేశ్వరం: గ్రామీణ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసు తెలిపారు. నీటి సరఫరా కోసం నూతనంగా నియమితులైన సిబ్బందికి మంగళవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎక్కడైనా నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడితే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఈఈ సందీప్, డీఈఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటరమేశ్, ఎంపీఈఓ సాల్మన్‌రాజ్, ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీడీలు చుట్టి.. కొలువు పట్టి..

భైంసా, న్యూస్‌టుడే: వారిది నిరుపేద కుటుంబం. తమ పిల్లలకు ఉన్నత విద్యనందించి ఉద్యోగాలకు పంపాలనే తపన వారిది.. ఎన్ని కష్టాలు వచ్చినా.. ఆర్థిక ఇబ్బందులు ఎదురొచ్చినా పిల్లలను చదివించారు. తల్లిదండ్రుల కలను సాకారం చేసేందుకు నిరంతరం కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించారు. భైంసా పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన ఆకుల విఠల్ వ్యవసాయ కూలీ, తల్లి సరస్వతి బీడీ కార్మికురాలు. వారికి కుమారుడు నవీన్, కూతురు నవనీత సంతానం. నవీన్ ప్రభుత్వ కళాశాలల్లో చదివి, కేంద్ర ప్రభుత్వ 'ఐఎన్ఎస్ఈఆర్' పుణె విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం చెన్నైలో మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలో రీసెర్చ్ ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. కూతురు నవనీత పదోతరగతి వరకు బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ప్రభుత్వ ఉపకారవేతనంతో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఆదిలాబాదు ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. 2014 డీఎస్సీలో ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారు. తాజా డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఒకవైపు చదువుకుంటూనే తల్లికి చేదోడు వాదోడుగా బీడీలు చుట్టడం, మరోవైపు లక్ష్య సాధనలో పుస్తకాలతో కుస్తీ పట్టడం ఆమె దినచర్యలో భాగమైంది. తానూరు మండలం మహలింగి గ్రామానికి చెందిన దడిగె రాములుతో 2016లో వివాహమైంది. అతడు సైతం ఎమ్మెస్సీ ఎంఈడీ పూర్తి చేసి వ్యవసాయ పనులు చూసుకుంటూనే భవిత కేంద్రంలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తాజా డీఎస్సీలోనూ ప్రత్యేక విద్యలో రాములు ఎస్జీటీగా ఉద్యోగం పొందారు.


తల్లి సరస్వతితో బీడీలు చుడుతున్న ఆకుల నవనీత


దడిగె రాములు

ఉద్యోగ ప్రయత్నంలో పిల్లలకు దూరమయ్యాను..

ఆకుల నవనీత

ఉపాధ్యాయురాలు కావాలనే తపనతో పెళ్లికి ముందు అమ్మకు సహాయంగా బీడీలు చుట్టి చదువుకున్నాను. పెళ్లి అయ్యాక ఇద్దరు పిల్లలు పుట్టారు. కానీ నా ఆకాంక్షను మా ఆయన ఎన్నడూ కాదనలేదు. డీఎస్సీకి సన్నద్ధం కావడానికి శిక్షణ కోసం ఇద్దరు పిల్లలను అత్త పద్మ, మామ ధర్మన్న, అమ్మ సరస్వతి వద్ద వదిలి వెళ్లాను. పిల్లల ప్రేమకు దూరమయ్యాను. అందరి ప్రోత్సాహం, త్యాగంతో మాకీ ఫలితం దక్కింది. నా భర్త ప్రత్యేక అవసరాల విద్యలో జిల్లాలో 10వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికవడం సంతోషాన్నిచ్చింది.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు భార్యాభర్తల ఎంపిక

విజయం సాధించిన అక్కాచెల్లెలు

నిర్మల్ అర్బన్: లక్ష్మణచాంద మండల పద్మల్‌కు చెందిన (ప్రస్తుతం నిర్మల్‌లోని దత్తాత్రేయనగర్‌లో ఉంటున్న) ఇస్లావత్ దత్తురాం- అంబిక దంపతుల ఇద్దరు కుమార్తెలు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. దత్తురాం స్కూల్ అసిస్టెంట్‌గా సోన్ మండలం వెల్మల్ బొప్పారంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పెద్ద కుమార్తె నిరోషణదేవి 2018లో, రెండో కూతురు వైష్ణవిదేవి 2021లో ఆదిలాబాద్ డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేశారు. డీఎస్సీ-2024 పరీక్షకు సన్నద్ధమయ్యారు. మంగళవారం ప్రకటించిన జాబితాలో ఎస్జీటీలుగా ఇద్దరూ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ కుటుంబంలో నుంచి మరో ఇద్దరికి కొలువులు దక్కడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కుమారుడు గురుకుల కాంప్లెక్స్‌లో బీటెక్ చదువుతున్నారు.


అక్కాచెల్లెలు నిరోషణ దేవి- వైష్ణవిదేవి

ఉపాధ్యాయులుగా ఎంపిక

ఖానాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చెట్పల్లి సాయి, మాధురి, పద్మావతినగర్ కాలనీకి చెందిన గర్క లావణ్య, విద్యానగర్ కాలనీకి చెందిన సంద ప్రవళిక సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికయ్యారని తమ చరవాణులకు మంగళవారం సందేశాలు వచ్చాయని వారు తెలిపారు.


సాయి


రోడ్లపై పంటలు ఆరబోసిన రైతులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

ప్రమాదాలకు కారకులైతే కేసులు తప్పవు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: రహదారులపై పంటలు ఆరబోసుకుని ప్రమాదాలకు కారకులైన రైతులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం లోకేశ్వరం నుంచి పంచగుడి వెళ్లే రహదారితో పాటు లోకేశ్వరం నుంచి దేగాం వెళ్లే రహదారిపై పంటలు ఆరబోసిన రైతులకు అవగాహన కల్పించారు. పంటలు రోడ్డుపై ఆరబోయడంతో పాటు సగానికి పైగా రోడ్డును ఆక్రమించుకుని రాత్రి వేళల్లో వాటిపై నల్లని టార్పాలిన్ కవర్లు కప్పుతూ రాళ్లు పెడుతున్నారన్నారు. గతంలో లోకేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు, పంచగుడి గ్రామానికి చెందిన ఇరువురు పంట కుప్పల కారణంగా ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఎన్ని మార్లు చెప్పినా రైతుల పద్ధతిలో మార్పు రావడం లేదని, ఒక వేళ ఎవరి కుప్ప వద్దనైనా ప్రమాదం చోటు చేసుకుంటే సంబంధిత రైతుపై కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.


సారంగాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాలలు

'మందకృష్ణ వ్యాఖ్యలు సరికాదు'

సారంగాపూర్: ముప్పయేళ్లుగా ఉద్యమం చేస్తున్న ఏనాడూ మిమ్మల్ని మేము అడ్డుకోలేదు, కానీ ఇటీవల మీరు మాపై చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ బత్తుల రంజిత్ అన్నారు. మంగళవారం ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణం ట్యాంక్‌బండ్ నుంచి సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల గుండా నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సారంగాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను మంద కృష్ణ హెచ్చరించడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. తహసీల్దార్ ఎస్.శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. ర్యాలీలో నాయకులు ఎ.రాజేశ్వర్, కొంతం అడెల్లు, కుంటోల్ల వెంకటస్వామి, జి.రాజేశ్వర్, ఆర్.గంగన్న, కొంతం మురళీధర్, కోట రాములు, ఈశ్వర్ పాల్గొన్నారు.

తపాలా పథకాలపై అవగాహన

పెంబి: తపాలా శాఖ బీమా, సంక్షేమ, పొదుపు పథకాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం పెంబిలో తపాలా శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు.

చల్లంగ చూడమ్మా.. దుర్గమ్మా..!


నిర్మల్ శాంతినగర్‌లో మంగళహారతులతో పాల్గొన్న భక్తులు


లక్ష్మణచాంద: మునిపెల్లిలో..


కుంటాలలో..


మామడలో దుర్గామాత వద్ద కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రులు జిల్లావ్యాప్తంగా జరుగుతున్నాయి. నిర్మల్ పట్టణంలోని బాగులవాడలో కొలువైన దుర్గామాత మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. శాంతినగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో వేదపండితుడు గుడి రాజేశ్వరసిద్ధాంతి ఆధ్వర్యంలో లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చన చేపట్టారు. ఇందిరానగర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని అన్నపూర్ణదేవి రూపంలో అలంకరించారు. కుంకుమ పూజ చేపట్టారు.


సారంగాపూర్: కౌట్ల(బి)లో ఆలయం వద్ద ..


ఖానాపూర్ : డబుల్ బెడ్‌రూం కాలనీలో.. మున్సిపల్ ఛైర్మన్ సత్యం


కడెం: మాసాయిపేట దుర్గామాత సన్నిధిలో

సంక్షిప్త సమాచారం

బాలికలకు అండగా ఉంటాం

తానూరు(భైంసా): తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన తానూరు మండలం బెల్‌తరోడా గ్రామానికి చెందిన మేరొల్ల దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని మేరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ అన్నారు. మంగళవారం బాలికకు సంఘం తరపున రూ.56వేల ఆర్థిక సహాయం అందించారు. మాజీ సర్పంచి గోప సాయినాథ్, ఎం.గంగాధర్, నాగన్ పటేల్, అశోక్, శ్రీనివాస్, దత్తాత్రి, మురళీధర్, ఉమేశ్, భీంరావు, రమేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలని డిమాండ్

ఖానాపూర్: మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిపడ్డ 4 నెలల వేతనాలు విడుదల చేయాలని, వేతనాలు రూ.10 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో మంగళవారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల కార్మికులు పాల్గొన్నారు

మంజులాపూర్ నుంచి అడెల్లికి పాదయాత్ర

సారంగాపూర్: నిర్మల్ పట్టణం మంజులాపూర్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన దుర్గామాత మాలధారకులు మంగళవారం సారంగాపూర్ మండలంలోని అడెల్లి మహా పోచమ్మ వరకు పాదయాత్ర చేపట్టారు. 20 కిలో మీటర్లు పాదయాత్ర చేసి అడెల్లికి చేరుకున్నారు. బాలాలయంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చంద గ్రామానికి చెందిన డొంకేశ్వర్ నర్సవ్వ ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న భాజపా నాయకుడు, ప్రజా ట్రస్టు వ్యవస్థాపకుడు మోహన్‌రావు పటేల్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయం కింద వారికి నిత్యావసర సరకులు అందించిన పటేల్ ఇంటి స్థలాన్ని చదును చేసుకుంటే తాత్కాలికంగా సొంత డబ్బులతో షెడ్డు నిర్మించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిర్మల్: తమ సమస్యలు పరిష్కరించాలని రైసు మిల్లర్ల సంఘం జిల్లా బాధ్యులు మంగళవారం కలెక్టర్, అదనపు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. సన్నరకం క్వింటాలు ధాన్యంలో 67 శాతం బియ్యం రావని, టెస్ట్ మిల్లింగ్ చేసిన తర్వాతే నిర్ధారించాలని, దొడ్డు రకంలోనూ మిగతా జిల్లాలతో పోల్చితే నిర్మల్‌లో క్వింటాలుకు 7 నుంచి 8 కిలోల బియ్యం తక్కువగా వస్తుందన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఎంపిక

లోకేశ్వరం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు దండె రమేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రాజు, శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎర్రన్న, కోశాధికారిగా గంగాధర్ ఎన్నికయ్యారు.

పార్టీలకతీతంగా బీసీలు ఏకమవ్వాలి

నిర్మల్ పట్టణం: రాజకీయంగా ఎవరు ఏ పార్టీలో ఉన్నా బీసీల ఉన్నతి కోసం బీసీవర్గాలన్నీ ఏకమవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రానికి వచ్చిన భాజపా బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌ను మోకుదెబ్బ జాతీయాధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సభ్యుడు పడాల రాజేందర్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

భాజపాతోనే దేశ వికాసం

సోన్: భాజపాతోనే దేశ వికాసం సాధ్యమని, దానిని నరేంద్ర మోదీ నాయకత్వం నిరూపించిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలో భాజపా మండల నాయకులతో కలిసి రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై విజయోత్సవ సమావేశం నిర్వహించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్: దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్పందన దివ్యాంగుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ అన్నారు. మంగళవారమిక్కడ నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడారు. అర్హులైన వారందరికీ అంత్యోదయ కార్డులు, స్వయం ఉపాధి రుణాలు, ఉచిత బస్ పాస్ సౌకర్యం, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర వాటిని నెరవేర్చాలని పేర్కొన్నారు. నాయకులు శివకుమార్, లింగన్న, రాజేశ్, భీమన్న, గణేశ్, జ్యోతి, సునీత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఆయుధ పూజలు

భైంసా: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం పద్మావతి కాలనీలోని లక్ష్మి వెంకటేశ్వర ఆలయంలోని ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపంలో ఆయుధ పూజలు నిర్వహించారు. పూజారి చేతుల మీదుగా చేసిన పూజల్లో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు గుజ్జుల్‌వార్ వెంకటేశ్, రంగు శ్రీనివాస్, శివకుమార్, పెరుగు నవీన్, తూమొల్ల దత్తాత్రి, డి.రాజేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రకృతికే సంబరం.. మన బతుకమ్మ

నిర్మల్, న్యూస్‌టుడే: ప్రకృతికే సంబరం మన బతుకమ్మ అని, ఇలాంటి పండగ కలెక్టరేట్‌లో జరపడం సంతోషంగా ఉందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి జిల్లా గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులతో కలిసి కోలాటం, బతుకమ్మ ఆటలు ఆడారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, మహిళా సంఘాల సభ్యులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బతుకమ్మతో కలెక్టర్ అభిలాష అభినవ్, ఉద్యోగినులు


లోకేశ్వరం: హావర్గలో బతుకమ్మలతో.


కుంటాల: లింబా(కె)లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

నేర వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగాం అనుబంధ గ్రామమైన వడ్డెపెల్లి వాసి దేవల రాజు(35) గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈయనకు భార్య న్నారు. అదే గ్రామానికి చెందిన పల్లపు రాజేశ్ అనే వ్యక్తి తన భార్యపై ప్రవర్తించిన తీరుతో మనస్తాపానికి గురయ్యారు. ఇరవై రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌కు, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని పశువుల కాపరి..

సోన్, న్యూస్‌టుడే: పశువులను మేపుతున్న మహిళ వాటిని రోడ్డు దాటిస్తున్న క్రమంలో కారు ఢీకొని మృతిచెందిన ఘటన మంగళవారం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. సోన్ ఏఎస్సై భీమేశ్వర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా, మెండోరా మండలం వెల్కటూరు గ్రామ వాసి హనుమవ్వ(48) గంజాల్ గ్రామానికి పశువుల కాపరిగా వచ్చారు. గ్రామ శివారులో రోజూ పశువులను మేపుతున్నారు. మంగళవారం ఉదయం పశువులను మేతకు తోలుకెళ్లి టోల్‌ప్లాజా సమీపంలో వాటిని రహదారి దాటిస్తుండగా ఓ కారు ఆమెను ఢీ కొట్టింది. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేశారు.


హనుమవ్వ

చేపల వేటకు వెళ్లి యువకుడి..

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో చేపల వేటకు వెళ్లి గెడం సంతోష్(26) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మడెపల్లికి చెందిన గెడం అర్జున్ తన కుటుంబంతో కలిసి కొంత కాలంగా స్వర్ణ గ్రామంలో నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు సంతోష్ గ్రామంలోని ఓ రైతు వద్ద పాలేరుగా పనిచేస్తున్నారు. సోమవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సంతోష్ తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం తండ్రి అర్జున్ అతని సోదరుడు పంటక్షేత్రానికి వెళ్లి చూడగా పక్కనే ఉన్న స్వర్ణ వాగులో సంతోష్ మృతదేహం కనిపించింది. వాగు పక్కనే ఉన్న వ్యవసాయ విద్యుత్తు మోటరు డబ్బా నుంచి విద్యుత్తు తీగను నీటిలో వేసి చేపల వేటాడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పరిసరాలు స్పష్టం చేస్తున్నాయి.. మృతుడికి భార్య ఉన్నారు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు.

హుండీ పగులగొట్టి దొంగతనం

కుంటాల: శివాలయంలోని హుండీ పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని ఓలాలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, ఆలయ సమితి సభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యాల మేరకు రాత్రి 10.12 గంటలకు చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగుడు ముందుగా ఆలయ గేటు ముందర వాహనాన్ని నిలిపాడు. ఎవరూ లేని సమయంలో గేటు దూకి లోనికి ప్రవేశించాడు. హుండీ వద్దకు చేరుకునే క్రమంలో సీసీ కెమెరాలను గమనించి ధ్వంసం చేశాడు. తర్వాత ఆలయం దగ్గర ఉన్న హుండీని ఆవరణలోకి తీసుకెళ్లాడు. రాడ్లతో తాళం పగులగొట్టాడు. అందులో ఉన్న కొంత మొత్తాన్ని తీసుకుని పరారయ్యాడు. మంగళవారం ఉదయం చోరీ విషయాన్ని గమనించి పోలీసులకు తెలియజేశారు. ఏఎస్సై దేవ్‌రావు, పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్- వడ్యాల్ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి 8గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రాచాపూర్ గ్రామానికి చెందిన సునీల్ వడ్యాల్ వైపు నుంచి కనకాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. కొండాపూర్‌లో నివాసం ఉంటున్న రాజు ద్విచక్రవాహనంపై వడ్యాల్ వైపు వస్తున్నారు. సరస్వతీ కాలువ వంతెనపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాల్లో నిర్మల్‌కు తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.


స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికతో ఆబ్కారీ అధికారులు

భారీగా నల్లబెల్లం పట్టివేత

పెంబి, న్యూస్‌టుడే: నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లంతో పాటు పటికను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. మంగళవారం మండలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెంబి మండల కేంద్రంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న రాజేందర్ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 8 టన్నుల నల్లబెల్లం, 8.7 క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సీఐలు గంగారెడ్డి, లక్ష్మణ్‌రావు, ఎస్సైలు వసంత్‌రావు, గజేందర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.